teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 354 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 17 మే 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఈ నెల 22న ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**హాజరుకానున్న 4,12,724 మంది విద్యార్థులు**



తెలంగాణ బ్యూరో, మే 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు మొత్తం 4,12,724 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఫస్ట్ ఇయర్ జనరల్ కోర్సులో 2,49,032 మంది, ఒకేషనల్



## రాబోయే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ పెరగబోతోంది

అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


.. వివరాలు 2లో



# రైన్ అలెర్ట్

## రాగల నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు

18 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ.. ఈ మేరకు వాతావరణ శాఖ వెల్లడి



రాగల నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలుకురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ భారీనుంచి అతి భారీ వానలకు అవకాశం ఉందన్న అధికారులు 18 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.



## కల్తీ విత్తనాల వ్యాపారులపై పీడీ యాక్ట్

నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠిన చర్యలు

అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో అధికారులతో సమీక్షా

హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో

మిగతా 2 లో



## తీవ్ర దుఖంలో ఉన్న రైతులకు రాష్ట్ర సర్కార్ గుడ్ న్యూస్

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన

.. వివరాలు 2లో



02

## రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు

సన్న, దొడ్డు వడ్లు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ధాన్యం కొనుగోలుపై మంత్రి పొన్నం సమీక్షా



## ఎంజీఎం హాస్పిటల్లో పాము కలకలం

పాము ప్రత్యక్షంతో రోగులు, సిబ్బంది ఒక్కసారిగా పరుగులు

వరంగల్, మే 16 (తీన్మార్ న్యూస్): ఎంజీఎం హాస్పిటల్లో పాము కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం రేడియాలజీ విభాగం (రూమ్ నంబర్ 92)లో పాము ప్రత్యక్షం కావడంతో రోగులు, సిబ్బంది ఒక్కసారిగా అవాక్కయి పరుగులు తీశారు. ఓపీ సేవలు కొనసాగే

మిగతా 2 లో

## ఫేక్ ఏసీబీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏసీబీ పేరుతో కొత్త మోసానికి తెరలేపిన ఆగంతకులు

ప్రభుత్వ అధికారులకు ఏసీబీ కీలక సూచనలు

హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ అధికారులకు తెలంగాణ ఏసీబీ కీలక సూచనలు చేసింది. ఫేక్ ఏసీబీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఏసీబీ పేరుతో కొందరు అగంతకులు కొత్త మోసానికి తెరలేపారని సూచించారు. స్వయంగా ఏసీబీ పేరుతోనే ఫేక్ కాల్స్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని లేకపోతే

మిగతా 2 లో






## డిప్యూటీ సీఎం భట్టి దంపతులు సరస్వతి పుష్కరాలల్లో పుణ్యస్నానం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరంలో సరస్వతిపుష్కరాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు

మిగతా 2 లో



## నిజాలు బయట పెట్టినందుకు అభినందనలు

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్

.. వివరాలు 2లో

## నేడు హైదరాబాద్ లో జరగనున్న తిరంగ యాత్ర

బీజేపీ ఆధ్వర్యంలో కొనసాగనున్న యాత్ర





## ఈ నెల 19న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం

అధ్యక్షత వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం

తెలంగాణ బ్యూరో, మే 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 19న సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ భేటీలో పలు కీలక అంశాలపై

మిగతా 2 లో

## తుది దశలో కాళేశ్వరం కమిషన్ విచారణ

బహిరంగ విచారణకు పొలిటికల్ లీడర్లను పిలువొద్దు

సూత్రప్రాయంగా కమిషన్ నిర్ణయం

4వందల పేజీల రిపోర్టును తయారు చేసిన కమిషన్

ఈ నెల 20వ తర్వాత ప్రభుత్వానికి రిపోర్ట్



02



## మంత్రి సురేఖ వ్యాఖ్యలు పార్టీ నేతలను డిఫెన్స్‌లో పడేసింది

రాష్ట్ర మంత్రి వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

.. వివరాలు 2లో

# రైన్ అలెర్ట్



తెలంగాణ బ్యూరో, మే 16 (తీన్మార్ న్యూస్): రాగల నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలుకురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ భారీనుంచి అతి భారీ వానలకు అవకాశం ఉందన్న అధికారులు 18 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నట్లు వాతా వరణ శాఖ వెల్లడించింది. అదే విధంగా ఉత్తర, దక్షణి ద్రోణి ప్రభావంతో పాటు ఆగ్నేయ బంగా ళాఖాతం, దాని పరిసరాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల చక్రవాక ఆవర్తనం ఏర్పడినట్లు చెప్పింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇవాళ నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నా రాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారె డ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయని చెప్పింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.



**అక్కడక్కడ వర్షాలు**

ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

రాగల నాలుగు రోజుల పాటు రా ష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ భారీ నుంచి అతి భారీ వానలకు అవకాశం ఉందన్న అధికారులు 18 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నట్లు వాతా వరణ శాఖ వెల్లడించింది. అదే విధంగా ఉత్తర, దక్షణి ద్రోణి ప్రభావంతో పాటు ఆగ్నేయ బంగా ళాఖాతం, దాని పరిసరాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల చక్రవాక ఆవర్తనం ఏర్పడినట్లు చెప్పింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇవాళ నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నా రాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారె డ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయని చెప్పింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల

## డిప్యూటీ సీఎం భట్టి దంపతులు సరస్వతి పుష్కరాలల్లో పుణ్యస్నానం



మొదటి పేజీ తరువాయి

శుక్రవారం (మే 16) సరస్వతి పుష్కరాలల్లో పుణ్యస్నానం చేశారు. పుష్కరాలకు వెళ్లిన భట్టి దంపతులకు వేద పండితులు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంఘమంలో భట్టి దంపతులు పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత సరస్వతి మాత నదికి ప్రత్యేక పూజలు చేసి పట్టు చీరతో సారే అప్పజేప్పారు. భట్టి సరస్వతి నది హారతి కార్యక్రమంలో పాల్గొని వీక్షించారు. భట్టి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. కాగా, గురువారం (మే 15) నుంచి సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి నదిలో మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి పుణ్యస్నానమాచరించారు. తర్వాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించి.. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఈ నెల 15 నుంచి 26 వ తేదీ వరకు 12 రోజులపాటు సరస్వతీనది పుష్కరాలు వైభవంగ జరుగనున్నాయి . ఈ సమయంలో సరస్వతి నదితీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తారు. ఏ నదిలో పుష్కరాలు జరుగుతున్నాయో ఆ నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం సరస్వతి నది పుష్కరాలకు సిద్ధమవుతుంది. తెలంగాణలోని కాళేశ్వరంలో సరస్వతినదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు సిద్ధమవుతున్నారు. ఈ పుష్కరాలు కాళేశ్వరం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను పెంచుతుంది. టెంపుల్ టూరిజంపై తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని కూడా ప్రతిబింబించే అవకాశం ఉంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

**సరస్వతి నది పుష్కరాలు జరిగే ప్రదేశాలు**

తెలంగాణా రాష్ట్రంలోని కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలోను సరస్వతీ నదీ పుష్కరాలు జరుగుతాయి. సరస్వతీ నది ఉత్తరాఖండ్ రాష్ట్రం బద్రీనాథ్ దగ్గరలోని “మన” అనే గ్రామంలో పుట్టింది. అయితే ఈ నది అంతర్వాహిని. అందువల్ల సరస్వతి నదీ పుష్కరాలు “మన” లో జరుగుతాయి. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. నదిలో సమృద్ధిగా నీళ్లు ఉండి, పుష్కరాలు విజయవంతంగా జరిగేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది.

## నిజాలు బయట పెట్టినందుకు అభినందనలు

హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. మంత్రులు కమిషన్లు తీసుకోకుండా ఏ పనిచేయరంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో కనీసం ఇప్పటికైనా కొన్ని నిజాలు బయట పెట్టినందుకు మంత్రి కొండా సురేఖకు నా హృదయపూర్వక అభినందనలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ సర్కార్ గా మారిపోయింది. ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్. అంతేకాదు, ఈ ప్రభుత్వంలో ఫైల్స్‌పై సంతకం చేసేందుకు మంత్రులు, వారి సహచర మంత్రులు 30శాతం కమిషన్ తీసుకుంటున్నారు. ఇదే కమిషన్ల వ్యవహారంలో సచివాలయంలో పలువురు కాంట్రాక్టర్లు ధర్నా చేసిన విషయం గుర్తుందా? అని ప్రశ్నించారు. ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది. ఈ సందర్భంగా కొండా సురేఖని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. కమిషన్లు తీసుకుంటున్న మంత్రుల వివరాల్ని బయటపెట్టాలి. ప్రజల ముందు బహిర్గతం చేయాలని అన్నారు. ఇదే అంశంపై రాహుల్ గాంధీ,రేవంత్‌రెడ్డిలు వారి సొంత కేబినెట్ మంత్రి చేసిన ఆరోపణలపై మీరు దర్యాప్తుకు ఆదేశించగలరా? అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## మంత్రి సురేఖ వ్యాఖ్యలు పార్టీ నేతలను డిఫెన్స్‌లో పడేసింది

హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): మంత్రులు ఫైళ్ల క్లియరెన్స్‌కు మంత్రులు తీసుకుంటున్నారని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలో నేతలను డిఫెన్స్‌లో పడేసింది. అయితే, తాజగా ఆమె చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని స్వయంగా మంత్రే ఒప్పుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో ఎవరెవరు ఎంతెంత కమీషన్లు తీసుకున్నారో వెంటనే దర్యాప్త చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మంత్రులు తీసుకున్న కమీషన్ల వివరాలను ప్రజల ముందుంచాలని కామెంట్ చేశారు.

## రాబోయే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ పెరగబోతోంది



హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగబోతోందని అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలు, రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో విద్యుత్ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. భవిష్యత్ లో హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవడం, విద్యుత్ లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలన్నారు.

**ఫుట్ పాత్, నాలాల్లో సోలార్ ఉత్పత్తి:**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. సెక్రటేరియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలన్నారు. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలా ల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదన్నారు. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని సూచించారు.

**9.8 శాతం పెరిగిన విద్యుత్ డిమాండ్:**

గత యేడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందని ఈ యేడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని ముఖ్యమంత్రికి అధికారులు వెల్లడించారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని అది 2034- 35 నాటికి 31,808 మెగావాట్ల డిమాండ్ కు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు.

## తుది దశలో కాళేశ్వరం కమిషన్ విచారణ



హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం కమిషన్ విచారణ తుది దశకు చేరుకుంది. బహిరంగ విచారణకు పొలిటికల్ లీడర్లను విచారణకు పిలువొద్దని కమిషన్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు ఊరట లభించినట్లైంది. లీగల్ సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో వారిని విచారణకు పిలవకూడదని నిర్ణయం తీసుకుంది. డాక్యుమెంట్ ఆధారాలతో కమిషన్ ఫైనల్ రిపోర్ట్ ఇవ్వనుంది. దాదాపు 4వందల పేజీల రిపోర్ట్‌ను కమిషన్ తయారు చేసింది. ఈ నెల 20వ తేదీ తర్వాత ప్రభుత్వానికి కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ రిపోర్ట్ ఇవ్వనుంది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం కమిషన్ గడువును ఈ నెల 31 వరకు తెలంగాణ ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విచారణ కోసం ప్రభుత్వం గత ఫిబ్రవరిలో కమిషన్‌ను నియమించగా, 100 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించింది. ఆ తర్వాత క్రమంగా కమిషన్ గడువును పొడిగిస్తూ వచ్చింది. రిపోర్ట్ రెడీ కాకపోవడంతో గడువును మే 31 వరకు ప్రభుత్వం పొడిగించింది.

## నేడు హైదరాబాద్‌లో జరగనున్న తిరంగ యాత్ర



హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయిన సందర్భంగా బీజేపీ చేపట్టిన తిరంగ యాత్ర నేడు హైదరాబాద్ లో జరగనుంది. హైదరాబాద్‌లో సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించబడుతుంది. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ యాత్రలో కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి, జమ్మూ కాశ్మీర్ డీజీపీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి రిటైర్డ్ ఐపీఎస్, డీజీపీ ర్యాంక్ అధికారులు, సైనిక అధికారులు, రక్షణ సిబ్బంది, కళాకారులు, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. దేశభక్తి నినాదాలు, సైన్యానికి మద్దతుగా కార్యక్రమాలు జరపనున్నట్టు కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరంగ యాత్రలో ప్రజలంతా పాల్గొనాలని ఆయన ఆహ్వానం పలికారు. కాగా ఈ కార్యక్రమానికి హైదరాబాద్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

## కల్తీ విత్తనాల వ్యాపారులపై పీడీ యాక్ట్



మొదటి పేజీ తరువాయి

శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ వానకాలం పంటలకు సన్నద్ధమవ్వాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చూడాలని చెప్పారు. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, కల్తీ విత్తనాల వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని ఆదేశించారు. సరిహద్దుల్లో విత్తన రవాణాపై నిఘా పెంచాలని.. రాష్ట్రవ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ దాడులకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు

రాజన్న సిరిసిల్ల, మే 16 (తీన్మార్ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియోకాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

## తీవ్ర దుఖంలో ఉన్న రైతులకు రాష్ట్ర సర్కార్ గుడ్ న్యూస్

హైదరాబాద్, మే 16 (తీన్మార్ న్యూస్): అకాల వర్షాలతో పంటలు నష్టపోయి తీవ్ర దుఖంలో ఉన్న రైతులకు తెలంగాణ సర్కార్ వారి కన్నీళ్ళు తుడిచే ప్రకటన చేసింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడం, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని, తడిసిన ధాన్యం సహా, చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని వెల్లడించారు. అలాగే పంటలు, పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కాగా రాష్ట్రంలో ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ సీజన్‌లో మొత్తం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలియజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఎంజీఎం హాస్పిటల్లో “పాము” కలకలం

మొదటి పేజీ తరువాయి

సమయం కావడంతో రేడియాలజీ విభాగంలో రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇదే సమయంలోనే పాము కనిపించడంతో కొంత సేపటి వరకు రోగులు, సిబ్బంది లోపలికి వెళ్లేందుకు భయపడ్డారు. సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది పాముని గుర్తించి పట్టుకొని, అనంతరం నిర్జన ప్రదేశానికి తరలించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎంజీఎం హాస్పిటల్ ఆవరణ పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పాములకు ఆవాసంగా మారడంతో ఇలాంటి ఘటనలు సర్వసాధారణంగా మారాయని, గతంలో వరుస రెండు దినాల్లో రెండు పాములు వార్డుల్లో కనిపించడం వ్యవస్థ పనితీరును చూపిస్తుందని, అధికారులు స్పందించి శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచినట్లయితే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రోగులు, సిబ్బంది భావిస్తున్నారు.

## ఫేక్ ఏసీబీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి




మొత్తం ఖాళీ అవ్వడం ఖాయమని పేర్కొన్నారు. ఏసీబీ పేరుతో ఎవరైనా కాల్ చేసి డబ్బులు అడిగితే వెంటనే తమను సంప్రదించాలని ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించండి అని ఏసీబీ హెచ్చరించింది. మోసాన్ని ముందే గ్రహించాలని చెప్పారు. అప్రమత్తంగా ఉండకపోతే పెను ముప్పు తప్పదని హెచ్చరించారు. అధికారులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరియు ఇలాంటి మోసపూరిత కాల్ చేసేవారితో సంబంధాలు పెట్టుకోవద్దని అధికారులు హెచ్చరించారు. ఫేక్ కాల్స్ వచ్చిన వెంటనే తమకు సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

## ఈ నెల 19న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం

మొదటి పేజీ తరువాయి

చర్చించనున్నట్లు సమాచారం. వచ్చే నెల జూన్ 2న జరగనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలపై ప్రధానంగా చర్చ జరగనుంది. అంతేకాకుండా, కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన విషయాలపై కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధి, పాలనకు సంబంధించిన ఇతర ముఖ్యమైన నిర్ణయాలు కూడా ఈ భేటీలో తీసుకోనున్నారని సమాచారం.

## ఈ నెల 22న ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

కోర్సులో 16,994 మంది ఉన్నారు. రెండవ సంవత్సరం జనరల్ కోర్సుకు 1,34,341 మంది, ఒకేషనల్ పరీక్షలకు 12,357 మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారు. గత నెల (ఏప్రిల్ 22) విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫస్ట్ ఇయర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య 1.91 లక్షల మందే అయినా, మెరుగైన ఫలితాల కోసం ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాయడానికి కూడా అనేక మంది దరఖాస్తు చేయడంతో మొత్తం సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి మే 29 వరకు జరగనున్నాయి. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు సబ్జెక్టుల వారీగా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇంకా, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు రెండు మూడు రోజుల్లో బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి. పరీక్షల అనంతరం 10 నుంచి 15 రోజుల్లో ఫలితాలను ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వద్దు: జిల్లా కలెక్టర్

రెండవ రోజు పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కాలినడకన తిరుగుతూ భక్తులతో సౌకర్యాల ఏర్పాట్లపై ఆరా

భక్తులకు ఇబ్బందులు కలగనివ్వద్దు అని అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్టాళ్లు, టెంట్ సిట, సరస్వతి ఘాట్ వద్ద భక్తులను పుష్కర ఏర్పాట్లు, సౌకర్యాలు, మరుగుదొడ్లు, షవర్స్, ఘాట్స్, చలి వేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాళ్లు జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారు చేసిన హ్యాండ్ మేడ్ వస్తువుల స్టాల్ జైళ్ల శాఖ డిఐజి సౌమ్య మిశ్రాతో కలిసి ప్రారంభించారు. వివిధ స్టాళ్లు పరిశీలించి వ్యాపారాలు గురించి అడిగి తెలుసుకున్నారు. చలి వేంద్రాలలో మంచినీటి సరఫరాను పరిశీలించారు. త్రివేణి సంగమం వద్ద భక్తులకు మంచినీటి సరఫరాకు చలి వేంద్రం ఏర్పాటు చేయాలని తక్షణమే వాకిటాఖీ ద్వారా ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ ని ఆదేశించారు. భక్తులతో మంచినీరు అందుతున్నదా? మరుగుదొడ్లు, స్నానాల షవర్స్ ఎలా ఉన్నాయంటూ భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు చేశారు. త్రివేణి సంగమంలో భక్తులు స్నానాలకు వెళ్ళడానికి వెళు ్ళ మార్గంలో పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని దాని వల్ల భక్తులు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మార్గంలో ఎలాంటి పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వాహణకు కేటాయించిన ప్రాంతంలో మాత్రమే పిండ ప్రదానాలు నిర్వహించాలని సూచించారు. వ్యర్థాలు గ్రామ పంచాయతి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్స్ లో వేయాలని, త్రివేణి సంగమంలో వేయొద్దని, భక్తులు నది పవిత్రను కాపాడాలని సూచించారు. అనతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాల్ లో భక్తులతో ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, డిఆర్డిఓ నరేష్, డిటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్సై

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

నర్వ సబ్ ఇన్స్పెక్టర్ సి కురుమయ్య





నర్వ, మే 16 తీన్మార్ న్యూస్: నర్వ మండల పరిధిలోని కల్వాల లో రహదారిపై స్థానిక ఎస్సై కురుమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వెహికిల్ చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదని నంబర్ ప్లేట్ లేని వాహనాలను,ట్యాంపరింగ్ చేసిన,సగం నంబర్ ప్లేట్ కలిగి ఉన్న వాహనదారులపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. తప్పనిసరి హెల్మెట్ ధరించాలని మద్యం తాగి వాహనాలు నడిపితే ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే క్రిమినల్ కేసులు తప్పవని ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేయొద్దు



ఆత్మకూర్ మే 16 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం రేచింతల గ్రామ శివారులో ఊక చెట్టు వాగు నుంచి గ్రామానికి చెందిన వ్యక్తులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం రోజు ఆత్మకూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేయగా ట్రాక్టర్ డ్రైవర్ హరీష్ రెడ్డి మరియు ఓనర్ నరసింహారెడ్డి ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని రేచింతల గ్రామ శివారులో పట్టుకొని ఆత్మకూరు పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్ హరీష్ రెడ్డి మరియు ఓనర్ నరసింహారెడ్డి పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నరేందర్ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక మొరం మట్టి తరలించినట్లయితే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోబడతాయని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

వాహనదారులకు సూచనలు సలహాలు

తెలియజేసిన ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్ వి.నరేందర్



ఆత్మకూరు మే 16 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజు ఆత్మకూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు ప్రయాణికులకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులను మరియు వాహనదారులను ఉద్దేశించి ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్ వి.నరేందర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని త్రిబుల్ రైడింగ్ చేయరాదని మద్యం సేవించి వాహనాలు నడపరాదని మైనర్లు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని శబ్ద కాలుష్యాన్ని చేసే సైలెన్సర్లను వాడరాదని బైక్ రేసింగ్ బట్టి సహాసాలను చేయవద్దని ఆటోలలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకోవాలని వాహనదారులు తప్పనిసరిగా తమ డాక్యుమెంట్స్ ను దగ్గర ఉంచుకోవాలని సూచించారు ఇట్టి కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ గుప్తా, భూపాల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి




హనుమకొండ జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి

హనుమకొండ: వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు సేవలను అందరూ వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా సహకార అధికారి బి. సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రశాంత్ నగర్ లోని వరంగల్ అర్బన్ సహకార బ్యాంక్ బ్రాంచ్ లో సమావేశాన్ని నిర్వహించారు. బ్రాంచ్ లో సభ్యులు, డిపాజిటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సభ్యుడు స్వయం సహాయం, సమిష్టి బాధ్యత, సమానత్వం సామాజిక బాధ్యతతో సహకార బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ప్రజా బ్యాంకుగా అభివృద్ధి చేసి బ్యాంకు ద్వారా సేవలు పొందాలని కోరారు. ప్రతి సభ్యుడు పొదుపు ద్వారా వాటాదనం చెల్లించడం ద్వారా బ్యాంకు పరపతిని పెంచుతుందని అన్నారు. బ్యాంకులో లాకర్ల సౌకర్యం ఉందని, ప్రజలు అందరు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రాంత ప్రజలకు కోర్ బ్యాంకింగ్ సిస్టం ఏటీఎమ్స్, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రసాద్, బ్యాంకు మేనేజర్ సురేందర్ రెడ్డి, హనుమకొండ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, గోపాలపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, డిపార్ట్మెంట్ అధికారులు శ్రీనివాసరావు కృష్ణవేణి, సంధ్యారాణి, బ్యాంకు వాటాదారులు సభ్యులు పాల్గొన్నారు.

## అఖిలపక్ష ఐక్యవేదిక వారోత్సవాలు

కమిటీలు ఈనెల 24 తో విజయవంతం-వెల్లడించిన ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్



వనపర్తి మే 16 తీన్మార్ న్యూస్ : ప్రజా సమస్యలపైనే మా ఎజెండా, అవి పూర్తి చేయించడానికి మా పోరాటం కృషి ఉంటుందని, ప్రతి మండలాలను పట్టణాలు కమిటీలతో బలోపేతం చేసి ప్రజలకు అంకితం ఇస్తామని సతీష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం రోజున వనపర్తి పట్టణ కమిటీలను వేస్తున్నామని అధ్యక్షుడిగా 12 వ వార్డు కు చెందిన రామస్వామిని, ప్రధాన కార్యదర్శిగా ఐదో వార్డు కు చెందిన కురుమూర్తిని నియమించడం జరిగింది. మా కమిటీ సభ్యులను ముఖ్యమైన వారిని మాత్రమే ప్రకటిస్తామని, మిగతా వారంతా వివిధ పార్టీలలో, సంఘాలలో ఉండి సీక్రెట్ గా (ఇంటర్నల్) లా పనిచేస్తారని, కొద్దికాలం కొన్ని వ్యూహాలతో ముందుకెళ్తామని, మాకు సలహాలిచ్చి మమ్మల్ని నడిపిస్తున్న మేధావులు పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎవరిని బహిరంగపరచమని, పత్రికా, మీడియా ముఖంగా తెలుపుతున్నాము. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ యాదవ్ తోపాటు కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, బీసీ నాయకులు గౌనికాడి యాదయ్య సీనియర్ నాయకులు బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, కృష్ణయ్య, నాగరాజు, పుట్టపాక బాలు, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు పోక్సో చట్టం సైబర్ నేరాలు పట్ల అప్రమత్తతో ఉండాలి

డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): ఈరోజు జిల్లా విద్యా శిక్షణా కేంద్రం కొత్తగూడెం నందు జరుగుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టం, బాలికల అక్రమ రవాణా మరియు సైబర్ నేరాల పట్ల ఉపాధ్యాయులందరికీ డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్ వివరించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం నేరం చేయడమే కాకుండా, నేరాన్ని దాచిపెట్టడం కూడా నేరంగా పరిగణించబడుతుందని తెలియజేశారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన దగ్గర నుండి పాఠశాల నుండి వెళ్లే వరకు కూడా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని, తెలియని కాల్స్ కు సమాధానం ఇవ్వడం వల్ల మన అకౌంట్ హ్యాక్ అయి అందులో ఉన్న సొమ్ము మొత్తం చోరీకి గురవుతుందని , అందుకే అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే కాల్స్ కానీ వీడియో కాల్స్ కానీ సమాధానం ఇవ్వవద్దని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ %చీ%. సతీష్ కుమార్, 1 టౌన్ %జ.×% కరుణాకర్ , %ూ.×% విజయ, రిసోర్స్ పర్సన్లు సైదులు, మీరా హుస్సేన్, మురళి హరిబాబు లు పాల్గొన్నారు.




## సరస్వతి పుష్కరాల సందర్భంగా స్టాళ్లు పరిశీలించిన మంత్రి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): సరస్వతి పుష్కరాల నేపథ్యంలో పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అందుబాటులో ఉండే సదుపాయాలను, సేవలను సమీక్షించేందుకు మంత్రి శ్రీధర్ బాబు విస్తృతంగా పర్యటించారు. ఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు, భక్తులకు సరఫరా చేసే తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతుందని అధికారు లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్వచ్ఛత, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, శాసన సభ్యులు మక్కన్ సింగ్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, డిఆర్డీఓ నరేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాళ్లు ఏర్పాటు చేసిన వారితో ఫోటటోలు దిగి అభినందించారు.

## పంచాయతీరాజ్ శాఖల, గ్రామీణ అభివృద్ధి శాఖల సమీక్షా




ములుగు జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు లతో కలసి జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ. రాజీవ్ యువ వికాసం స్కీం కింద ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా కాన్సెంట్ తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల గురించి క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలని, అదేవిధంగా ములుగు జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య మెరుగ్గా ఉండాలని ఎక్కడ చెత్త నిలువలు ఉండకుండా, మురుగు కాలువలు అపరిశుభ్రంగా ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎప్పటిక ప్పుడు బ్లీచింగ్ చల్లుతూ పరిశుభ్రత పాటించాలని, గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీల పరిధిలో సామాజిక ఇంకుడు గుంతలు తీయాలని అని అన్నారు. గ్రామ పంచాయతీలలో క్షేత్రస్థాయిలో అర్హులైన వితంతువులకు పెన్షన్ల గురించి నివేదిక సమర్పించాలని అన్నారు, గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ ఉండాలని, జూన్ రెండవ తేదీన హెల్త్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తగు చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలను అధికంగా పెంచాలని,అదేవిధంగా పనులలో ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని అన్నారు. ఈ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న పనులను ఆయా సంబంధిత అధికారులు ఎల్లవేళలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎంపీడీవోలు, ఎం పీ ఓ లు, కార్యదర్శులు, బ్యాంకర్స్,ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం

- ఆర్మీకి కృతజ్ఞతగా నేడు బిజెపి తిరంగా యాత్ర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మే 16 :** భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు నిరూపించామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాక్ దిక్కుతోచని స్థితిలో కాళ్ల బేరానికి వచ్చిందని అన్నారు. దాని వైమానిక స్థావరాలు భారత్ దాడిలో ధ్వంసం అయ్యాయని అన్నారు. ఉగ్రవాదులకు ఊతమిస్తే ఇక పాక్ అంతుచూస్తామని ప్రధాని మోడీ హెచ్చరించారని అన్నారు. ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌తో పోరులో భారత సైన్యం చరిత్ర రాసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భాజపా నిర్వహించే తిరంగా యాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అంబేద్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇది సైనికులకు ఆత్మస్థయిర్యం నింపేలా, వారికి మద్దతుగా చేస్తున్నదని అన్నారు. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. ఇకపోతే ఈ దాడితో భారత సైనికపాటవాన్ని ప్రపంచం గుర్తించిందని అన్నారు.

# యజమాని భార్యతో అక్రమ సంబంధం

- కోటి రూపాయల డిమాండ్‌తో పోలీసులకు ఫిర్యాదు



**హైదరాబాద్, మే 16:** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఓ కారు డ్రైవర్ దాష్టీకం బయట పడింది. యజమాని భార్యతో కారు డ్రైవర్ వివాహేతర సంబంధం పెట్టుకోవడమే గాకుండా బ్లాక్‌మెయిల్‌కు తెగించాడు. యజమానిని బెదరించి భారీగా నగదు డిమాండ్ చేశాడు. అంతేకాకుండా.. అందుకు సంబంధించిన వీడియోలు సైతం బయట పెడతానంటూ యజమానిని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. అలా చేయకుండా ఉండాలంటే.. తనకు రూ. కోటి నగదు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. అలాగే భార్యకు సైతం విడాకులు ఇవ్వాలంటూ యజమానిని బెదిరించాడు. దీంతో సదరు యజమాని శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే విషయంపై కొన్ని రోజులుగా యజమానిని డ్రైవర్ ఇఫ్తికార్ ఆహ్మద్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అతడి భార్యతో కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు.. యజమాని సెల్ ఫోన్‌కు పంపాడు. వీటిని అతడి భార్యకు చూపించేందుకు యజమాని ప్రయత్నించాడు. అంతలోనే ఈ ఫొటోలు, వీడియోలను డ్రైవర్ డిలీట్ చేశాడు. దీంతో యజమాని మధ్యవర్తుల ద్వారా ఈ కేసు సెటిల్ చేసుకోవాలని భావించాడు. మధ్యవర్తుల వద్ద తనకు రూ. కోటి చెల్లించడంతోపాటు– అతడి భార్యకు సైతం విడాకులు ఇవ్వాలంటూ డ్రైవర్ డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో సదరు యజమాని విసిగిపోయి.. బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో డ్రైవర్ ఇఫ్తికార్ ఆహ్మద్‌పై పోలీసులకు యజమాని ఫిర్యాదు చేశాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

# ముగిసిన కాళేశ్వరం కమిషన్ విచారణ

**ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు కసరత్తు**

**హైదరాబాద్, మే 16:** కాళేశ్వరంపై విచారణ చేస్తున్న కమిషన్ తన విచారణ పక్రియను పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. నివేదికకు తుది మెరుగులు దిద్ది ఈనెల మూడో వారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గతేడాది నుంచి విచారణ చేస్తోంది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై కమిషన్ విచారణ జరిపింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను విచారించింది. వారి నుంచి అఫిడవిట్లు– తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలను కూడా కమిషన్ పరిశీలించింది. అన్ని అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకొంది. గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను కూడా విచారణకు పిలవాలని కమిషన్ మొదట భావించింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వారిని విచారణకు పిలవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి కమిషన్ వచ్చినట్లు– సమాచారం.

# బీజేపీ అన్ని విధాలుగా బలంగా ఉంది

**ఇండియా బ్లాక్ బలపడితేనే ఎదుర్కో గలం**

**మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, మే 16:** బీజేపీ అన్ని విధాలుగా బలంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కొనియాడారు. అదే సమయంలో విపక్ష ఇండియా బ్లాక్ భవిష్యత్తుపై అనుమానం వ్యక్తంచేశారు. కూటమిలో అనిశ్చితి నెలకొన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. అయితే ఇండియా బ్లాక్ బలంగా ఉంటనే బిజెపికి చెక్ పెట్టడం సాధ్యమని అన్నారు. ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చిదంబరం మాట్లాడుతూ.. ఇండియా బ్లాక్ చెక్కుచెదరకుండా ఉంటే చాలా సంతోషం. కానీ అది బలహీనంగా కనిపిస్తోంది. కానీ అది పుంజుకోవడానికి సమయం ఉంది. అదే భాజపా విషయానికొస్తే.. వ్యవస్థీకృతంగా బలంగా ఉందన్నారు. కాంగ్రెస్ కూటమి బలంగా ఉండాల్సిందేనంటూ.. అందులోని పార్టీలో మరింత పారదర్శకంగా నిలబడాల్సి ఉందన్నారు. నా అనుభవం, చరిత్ర చూస్తే.. ప్రతి విభాగంలోనూ పటిష్టంగా ఉన్న భాజపా లాంటి పార్టీ మరొకటి లేదు. ప్రతి వ్యవస్థను నియంత్రించగల, స్వాధీనం చేసుకోగల శక్తి కలిగిఉంది. అలాగే దానిని సవాలు చేయాలంటే.. విపక్ష కూటమి అన్ని విభాగాలను మెరుగుపరచుకోవాలి. ఈ పరిస్థితుల్లో 2029 ఎన్నికలు అత్యంత కీలకమని చిదంబరం అభిప్రాయపడ్డారు. దీనిపై బీజేపీ స్పందించింది. వరుస ఓటములు కాంగ్రెస్‌ను బాధించాయని ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. చిదంబరం అంచనా ప్రకా రం.. విపక్ష కూటమిలో అనిశ్చితి ఉంది. భాజపా బలమైన పార్టీ. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదని రాహుల్ గాంధీ అత్యంత సన్నిహితులకు కూడా తెలుసని మరో నేత ప్రదీప్ బండారీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ ఎప్పటికీ ఇక కోలుకోలేదన్నారు.



# వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్

**సిరిసిల్లలో భూభారతిపై అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి**

**సిరిసిల్ల, మే 16 :** వేములవాడకి కొత్తగా సబ్ రిజిస్టర్ ఆఫీస్ మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి చట్టం నలుగురి మధ్యలో నలుగురి కోసం మాత్రమే తయారు చేశారని.. భూ భారతి మాత్రం పేదల చట్టమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మన భూ భారతి చట్టం మోడల్‌గా తీసుకునే విధంగా ఉంటుందన్నారు. ధరణి చట్టంతో అనాడు పేద ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రతి భూ సమస్యను పరిష్కారమే విధంగా భూ భారతి చట్టం రూపొందించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 283 సర్వేయర్‌లు ఉన్నారు. కొత్తగా 6 వేల మంది సర్వేయర్లు ఏర్పాటు– చేస్తున్నామని తెలిపారు. 953 రెవెన్యూ గ్రామాల్లో వీఆర్ఎస్, వీఆర్వోలు ఉండే వారని.. బీఆర్ఎస్ వల్ల వాళ్లంతా రోడ్ల పాలయ్యారని విమర్శించారు. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తున్నామని చెప్పారు. అనాడు భూ సమస్య వస్తే కోర్టుకి వెళ్లాల్సి ఉండేదని.. కానీ ఇప్పుడు మన దగ్గరే సమస్య పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 1500 అప్లికేషలు వచ్చాయని.. అవి జూన్ 2 వరకు పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. మీ సమస్యలు చెబితే రెవెన్యూ అధికారులు మీ దగ్గరికే వస్తారని.. ఇందిరమ్మ ప్రభుత్వంలో చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం జరుగుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు జాగ్రత్తగా ఉండాలని.. రైతులను ఇబ్బంది పెట్టవద్దు, మీరు కూడా రైతు బిడ్డలేనని అన్నారు. ఏ అధికారి అయినా రైతులను ఇబ్బంది పెడితే వారిపై చర్యలు తీసుకునే విధంగా చట్టం ఉందని గుర్తు చేశారు.

# యాసంగి ధాన్యం సేకరణపై మంత్రులు ఉత్తమ్, తుమ్మల సమీక్షా



వరంగల్ జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): హైదరాబాదు నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో యాసంగి ధాన్యం సేకరణపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ లతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నుండి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల గురించి మంత్రులకు వివరిస్తూ జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు సెంటర్ల లో 2024– 25 రబీ సీజను కు గాను జిల్లా నుండి రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ అంచనా వేయగా ఇప్పటివరకు దాదాపు 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని , ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని ఏర్పాట్లు చేశామని, నిత్యంహోపర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సారి రాష్ట్రంలో యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయ్యిందని అన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుండి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్నలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాలలో పోలిస్తే ఈసారి దాదాపు రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుపుతున్నామని తెలిపారు. 2022–23 యాసంగిలో 25 .35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగగా, 2023 –24 లో 32 .93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. ఈ ఏడాది యాసంగికి సంబంధించి ఇప్పటికే 49 .53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని వివరించారు. ఇంకనూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెస్తున్నందున కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు.

ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంటర్మీడియట్ గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసిపోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. మరో రెండు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా, ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ మంజూరీలు తెలుపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బోగస్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా నుండి డిసిఓ నీరజ , డిఏఓ అనురాధ, డీఆర్డీఓ కౌసల్య దేవి, డి ఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీఎస్ఓ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్**



జనగామ జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): శుక్రవారం, జిల్లాలోని గానుగుపహాడ్, అడవికేశ్వాపూర్ గ్రామ పంచాయతీల పరిధిలో పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, కాంటా కొరకు బస్తాలలో ధాన్యాన్ని నింపుతున్న తీరును, ధాన్యం కొనుగోలు రిజిస్టర్లను తనిఖీ చేసి, ఓపీఎంఎస్ లో నమోదు చేసే రైతుల ధాన్యం కొనుగోళ్ల వివరాల గురించి కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎప్పటికప్పుడు కొనుగోళ్ల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, వాటిని సరైన విధంగా నిర్వహించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. అదే విధంగా ధాన్యాన్ని కేంద్రంలో ఎక్కువ రోజుల వరకు నిల్వ చేయకుండా, తేమ శాతం రాగానే తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సజావుగా నిర్వహించాలని, ధాన్యం కొనుగోళ్లలో అవకతవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని, కాంటాలో తేడాలు రావొద్దని, ఎటువంటి అలసత్వం వహించరాదని, తాడిపత్రిలు, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట డీఎం సీఎస్ హతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, డీసీఓ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ హుస్సేన్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం



మహబూబాబాద్ జిల్లా, మే 16 (తీన్మార్ న్యూస్): రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి సమాచార భాగస్వామిగా ఉండుటకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా గ్రామంలో ప్రజలకు ప్రజాప్రతినిధులకు గ్రామములో పనిచేస్తున్న గ్రామస్థాయి ఉద్యోగులకు ఒక సమాచార భాగస్వామిగా ఉండి గ్రామంలో అమలవుతున్న పథకాలన్నీ అమలుపరచడానికి కోసం పంచాయతీ కార్యదర్శి భాగస్వామిగా వ్యవహరించి ఒక పారదర్శకమైన పాలన అందించడానికి కోసం శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే స్నేహ పూర్వక పిల్లల గ్రామంలో మార్చటానికి కోసం చిన్న పిల్లల మనుగడ విద్య అభివృద్ధి భాగస్వామ్యం రక్షణ వంటి అంశాలపై కేంద్రీకరిస్తూ ఆ గ్రామము పిల్లల స్నేహపూర్వక గ్రామంగా మార్చుటకు శిక్షణ ఇవ్వడం జరిగింది అలాగే, పిల్లలపై జరుగుతున్న హింసలపై పిల్లలపై ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమము ముగింపులో గౌరవ జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ గారు శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులకు మరి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ద్వారా జారీ కాబడిన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటం జరిగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమానికి శిక్షణ ఇచ్చిన %ఎణం% అశోక్ కుమార్ గారు (రిటైర్డ్ ఎంపీడీవో), మీర్జా మునవర్ బేగ్ మండల పంచాయతీ అధికారి డోర్నకల్ మరియు డి మురహరి రావు గారు రిటైర్డ్ ఎంపీడీవో గారు డిఎల్పిఓ కనకదుర్గ మహబూబాబాద్ గారు మరియు డి ఎల్ పి ఓ తొర్రూర్ పుల్లారావు గారు పాల్గొన్నారు.



# అకాల వర్షాలతో కుదేలు!

ఏ ప్రభుత్వం వచ్చినా అన్నదాతలను ఆదుకోవడం లేదన్నది అర్థం అయ్యింది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లడం లేదు. మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది. మంత్రులు ప్రకటనలకే పరిమితం అయ్యారు. ఇటీవల ధాన్యం అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగడం లేదు. గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి ప్రకటించలేదు. ఇప్పుడేమో ధర్నాలు, ఆందోళనలకు బిఆర్ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటు. ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నాడుస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడం అన్నదాతలకు కష్టంగా మారింది. ఇప్పటికే ధరల హెచ్చు తగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా, పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వరి, వేరుశనగ, జొన్న,మక్క జొన్న ఇలా పంట ఏదైనా కొనుగోళ్లు సక్రమంగా లేవు. మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని కోరగా కొందరు నిరాకరించారు. ఓ వైపు మబ్బులు కమ్ముకొస్తున్న వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసి ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో చేసేదేమీ లేక జిల్లాల్లో వేరుశనగ రైతులు మళ్లీ బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. పంట పండించడం ఒక ఎత్తయితే పంట అమ్ముకోవడం మరో ఎత్తవుతున్నది. మార్కెట్‌లో వేరుశనగను ఎవరూ ఖరీదు చేయకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మిల్లుల వద్దకు వెళ్లి అడిగితే తక్కువ ధరకు కొంటామంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లే వచ్చింది. దిగుబడి తగ్గి నష్టపోగా, ధర లేకపోవడం, వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో సాగుచేయడం భారంగా మారుతోంది. పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వాలని కోరుతున్నారు. తామే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. మొలకలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాల్సి ఉంది. ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, తూకం వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు. జొన్న బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10-రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం అంతటా ఇదే దుస్థితి నెలకొంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఊరట కల్పించాల్సి ఉంది. ఇకపోతే గత నాలుగేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 27ననే నైరుతి రుతుపవనాలు రానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతోపాటు..దేశంలోనూ వివిధ ప్రాంతాలకు ఆలస్యంగా విస్తరించడంతో తొలకరి జల్లుల కోసం రైతులు కళ్లు కాయలు కాసే వరకు ఎదురు చూశారు. పైగా నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా తొలినాళ్లలో పెద్దగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండుతున్న ఎండాకాలం ప్రజలందరికీ వాతావరణశాఖ చల్లటి కబురు పంపింది. నైరుతి రుతుపవనాలు ఇప్పటికే అండమాన్‌ను తాకాయి. ఇప్పటికే వర్షాలు లేక జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. రుతుపవనాలు రాకతో విస్తరంగా వర్షాలు కురవనున్నాయి. సరైన సమయంలో రుతుపవనాలు పలకరిస్తే....సకాలంలో పంటలు వేయడం వల్ల ఆ తర్వాత వచ్చే తుపాన్‌లు, వరదల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది. వాతావరణశాఖ తెలిపిన చల్లని కబురుతో రైతుల ముఖంలో వెలుగులు నిండాయి. ఇప్పటికే పంటపొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మనదేశంలో నైరుతి రుతుపవనాల వల్లే విస్తరంగా వర్షాలు కురుస్తాయి. వర్షాధార పంటలకూ ఇవే ఆధారం. దేశంలో జూన్, జులై నెలలో పడే వర్షాలే అత్యంత కీలకం. సాధారణంగా నైరుతి రుతుపవనాలు కొంచెం అటు, ఇటుగా జూన్ తొలివారంలోనే దేశంలోకి ప్రవేశిస్తాయి. గతేడాది జూన్ 8న రాగా...ఈసారి వారం రోజులు ముందుగానే పలకరించనున్నాయి. ఒకసారి కేరళలోకి ప్రవేశించిన తర్వాత వారం పదిరోజుల్లోనే దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. తెలంగాణ ఏపీ భూభాగంపైకి విస్తరించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాయి. వర్షాధార పంటలపైనే ఆధారపడే తెలుగు రాష్ట్రాల ప్రజలకు నైరుతి రుతుపవనాల రాక ఎంతో కీలకం. అనుకున్న సమయం కన్నా ఆలస్యం కావడం వల్ల తొలినాళ్లలో వర్షాలు లేక ఇబ్బందిపడిన రైతులు... ఆ తర్వాత పంటలు చేతికొచ్చే సమయంలో కుంభవృష్టితో మరోసారి నష్టపోయారు. ఈసారి సకాలంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ కబురుతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

# ట్రైలర్ మాత్రమే చూపాం



భుజ్, రోమింగ్ న్యూస్: దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాక్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు చూసిందంతా ఓ ట్రైలర్ మాత్రమేనని అన్నారు. శుక్రవారం భుజ్ ఏయిర్‌బేస్‌లో రాజ్‌నాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ అధికారులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ఇప్పటి వరకు చూసిందంతా ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినపుడు ప్రపంచం మొత్తానికి పూర్తి సినిమా చూపిస్తాం. పాకిస్తాన్‌ను ఇప్పుడు ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టాము. పాక్ తన బుద్ధి మార్చుకుంటే పర్లేదు. లేకపోతే కఠినమైన శిక్షలు వేస్తాం' అని అన్నారు. ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయిర్‌ఫోర్స్ అధికారుల పని తీరును పొగడటానికి తనకు మాటలు సరిపోవటం లేదన్నారు. యావత్ దేశం తరపునుంచి మరోసారి ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాకిస్తాన్ గడ్డమీద ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను మీరు ఎలా ధ్వంసం చేశారో ప్రపంచం మొత్తం చూసింది. తర్వాత కూడా వారి ఏయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. భారత్ యుద్ధ నియమాలు, టెక్నాలజీ మారిందని ప్రపంచానికి మీరు చాటి చెప్పారు. ధైర్య, సాహసాలకు ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ ప్రతీకగా నిలిచింది. ఏయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌కు నా కృతజ్ఞతలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. గురువారం జమ్మూకాశ్మీర్ పర్యటనలో భాగంగా పాకిస్తాన్‌పై ఫైర్ అయ్యారు. పాకిస్తాన్ దగ్గర ఉన్న అణు బాంబులను లాక్కోవాలని ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి..పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ సైనికులతో సమావేశమైన కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి వచ్చిన నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలో ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తుందన్నారు. అప్పు చేసి మరీ దాయాది దేశం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని కోరారు. భవిష్యత్తులోనూ ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించొద్దని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు భారత్ అర్ధరాత్రి ఉదయపు వెలుగు ఎలా ఉంటు-ందో చూపించిందని.. మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ఈ ఆపరేషన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణి శక్తిని దాయాది దేశం కూడా అంగీకరించిందని పేర్కొన్నారు. భుజ్ వైమానిక స్థావరం అనేక పాకిస్థాన్ డ్రోన్‌లను కూల్చడాన్ని ప్రస్తావిస్తూ..సైన్యాన్ని ప్రశంసించారు. 1965లోనూ పాకిస్థాన్‌పై మన విజయానికి భుజ్ సాక్షిగా నిలిచిందని గుర్తు చేశారు.

## పాక్‌తో దూరంగా తాలిబన్ ప్రభుత్వం

### జైశంకర్‌తో విదేశాంగ మంత్రి చర్చలు



న్యూఢిల్లీ, మే 16: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సంచలన ఆరోపణలు చేసింది. భారత్ ప్రయోగించిన ఓ క్షిపణి అఫ్గాన్ భూభాగంలో పడినట్లు తప్పుడు ప్రచారం చేసింది. దీన్ని కాబూల్ ఖండించింది. తమకు ఎలాంటి హాని జరగలేదని, అదంతా అవాస్తవమేనని తాలిబన్ రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. అటు న్యూదిల్లీ కూడా పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టింది. ఈక్రమంలో తాజాగా అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో.. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని తాలిబన్లు ఖండించడాన్ని జైశంకర్ స్వాగతించారు. ఈవిషయాన్ని కేంద్రమంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తాలిబన్ ప్రభుత్వంతో న్యూదిల్లీ మంత్రిత్వ స్థాయి చర్చలు జరపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్‌తో మంచి సంభాషణ జరిగింది. పహల్గాం ఉగ్రదాడిని ఆయన ఖండించడం హర్షణీయం. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య విభేదాలు సృష్టించేందుకు ఇటీవల అవాస్తవ, నిరాధార ప్రచారం జరిగింది. దాన్ని ఆయన తోసిపుచ్చడాన్ని స్వాగతిస్తున్నా. అఫ్గాన్ ప్రజలతో మా స్నేహబంధాన్ని కొనసాగిస్తాం. వారి అభివృద్ధికి నిరంతర మద్దతు అందిస్తాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశంపై మేం చర్చలు జరిపామని జైశంకర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2021 ఆగస్టులో అఫ్గాన్‌లో తాలిబన్ పాలన ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ దౌత్య సంబంధాలు మాత్రం కొనసాగిస్తోంది. ఈ ఏడాది జనవరిలో దుబాయ్ వేదికగా ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. మరోవైపు, అఫ్గాన్‌లో అల్‌ఖైదా, ఐసిస్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ వంటి ఉగ్రముఠాల ఉనికిపై న్యూదిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చలు జరపడం తాజా పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. పాక్ ఒంటరి అయ్యిందనడానికి ఇది కూడా కీలక పరిణామంగా చూడాలి



## గులాబీలతో ఆర్టీసీ ఆహ్వానం

హైదరాబాద్, మే 16: ఆర్టీసీ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికులను ఆకట్టుకోవడంతో పాటు, వారిని మర్యాదగా పలకరిస్తూ.. గులాబీ పూలు ఇస్తూ ఆహ్వానిస్తున్నారు. అంతేగాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళుతూ ప్రమాదాల బారిన పడొద్దన్న కండక్టర్లు.. సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్ వనస్థలిపురంలో బస్సెక్కిన ప్రయాణికులకు కండక్టర్లు గులాబీ పూలు అందించారు. కండక్టర్ల అభ్యర్థనపై కొంత మంది హర్షం, మరికొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## బస్టాండ్లలో శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్లు: సీతక్క

హైదరాబాద్,మే16: దేశంలోనే ఆర్టీసీ బస్టాండ్‌లో తొలిసారిగా శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లను అందుబాటులోకి తెస్తున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సహేలి అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ములుగు, హనుమకొండ బస్టాండ్‌లో నాప్కిన్ వెండింగ్ మిషన్లను త్వరలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్నట్లు- వెల్లడించారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను మంత్రి సీతక్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు శుక్రవారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నెలసరి సమస్యలు ఎదుర్కొంటున్న మహిళా ప్రయాణికుల సౌలభ్యం కోసం ఈ వినూత్న ఆలోచన చేసినట్లు- తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్‌తో పెరగనున్న రక్షణ బడ్జెట్

### మరో 50వేల కోట్లు కేటాయించున్న కేంద్రం

### తాజా కేటాయింపులపై సన్నాహాలు?

న్యూఢిల్లీ, మే 16: భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణరంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- సమాచారం. ఆ రంగానికి రూ.50,000 కోట్ల మేర బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సన్నాహాలు చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశాలున్నాయి. దాంతో రక్షణశాఖకు కేటాయించిన నిధులు రూ.7 లక్షల కోట్లు- దాటుతాయని ఆ వర్గాలు తెలిపాయి. ఇండియన్ ఆర్మీ వరుస విజయాలు సాధించిన నేపథ్యంలో.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ శాఖకు మరో 50 వేల కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడి తర్వాత భారత్ ఏ విధంగా స్పందిస్తుందా.. అని ప్రతీ భారత పౌరుడితో పాటు ప్రపంచం మొత్తం ఎంతో ఆత్రుతగా ఎదురు చూసింది.



ఎవ్వరూ ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి మరీ ఇండియన్ ఆర్మీ ఉగ్రవాదులపై దాడులు చేసింది. వంద మంది ఉగ్రవాదులు ఈ దాడుల్లో చనిపోయారు. తర్వాత రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధంలో కూడా భారత్ తన సత్తా ఏంటో చూపించింది. పాకిస్తాన్‌లోని ఏయిర్‌బేస్‌లు, ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది. 2025..2026 సంవత్సరానికి భారత ప్రభుత్వం రక్షణ శాఖకు 6.81 లక్షల కోట్లను కేటాయించింది. గత సంవత్సరం కంటే ఇది చాలా ఎక్కువ. 2024..2025 సంవత్సరానికి గానూ కేంద్రం 6.22 కోట్లను కేటాయించింది. 2025..2026 సంవత్సరానికి ఆ నిధుల్ని 9.2 శాతం పెంచేసింది. వచ్చే బడ్జెట్.. అంటే 2026, 2027 సంవత్సరానికి గాను 6.81 లక్షల కోట్లకు మరో 50 వేల కోట్లు వచ్చి చేరే అవకాశం ఉంది. మొత్తంగా రక్షణ శాఖ బడ్జెట్ ఏకంగా 7 లక్షల కోట్లకు పైకే చేరుతుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందనుంది. ఏడు లక్షల కోట్ల బడ్జెట్ మొత్తాన్ని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఆయుధాల కొనుగోళ్లు, ఇతర అవసరమైన వస్తువుల కొనుగోలుకు వాడనున్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రక్షణ శాఖపై ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే ఏకంగా రూ. 2.29 లక్షల కోట్లను కేటాయించారు. చైనా, పాకిస్థాన్ నుంచి భద్రతా సవాళు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. రూ.50వేల కోట్ల అనుబంధ బడ్జెట్‌లో నిధులను పరిశోధన, ఆయుధాలు, అవసరమైన పరికరాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశాలున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిఫెన్స్ కేటాయింపులు రూ.2.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం వార్షిక పద్దులో 13 శాతం రక్షణకే కేటాయించారు.

# సింధూ నదీ జలాల వినియోగం భారీ రిజర్వాయర్ల నిర్మాణం

## తక్షణ ప్రణాళికలు సిద్ధంచేస్తోన్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ, మే 16:** సింధు, జీలం, చీనాబ్ నదులపై కొత్తగా డ్యామ్‌లు, భారీ రిజర్వాయర్లు త్వరితగతిన నిర్మించాలని భారత్ భావిస్తోంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు శీఘ్ర ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. పాక్‌కు ఇక్కడి నుంచిచుక్కనీరు కూడా వెళ్లకుండా ఉండేలా వీటిని అమలు చేయబోతున్నారు. ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయిన తర్వాత పాకిస్థాన్‌తో భారత్.. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సింధు నది, దాని ఉప నదులైన జీలం, చీనాబ్ జల వనరుల్ని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు ఆయా నదులపై కొత్త ప్రాజెక్టుల ప్రణాళిక, అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రణబీర్ కాలువను విస్తరించే ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నట్టు- సమాచారం. ఇది భారత్ చేపట్టాలని భావిస్తోన్న కీలక ప్రణాళికలలో ఒకటి. రణబీర్ కాలువ పొడవును 120 కి.మీ.కు రెట్టింపు చేయాలని, తద్వారా సెకనుకు 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కలుగుతుందని అంటు-న్నారు. ప్రస్తుతం దీని సామర్థం 40 క్యూబిక్ మీటర్లు. దీంతోపాటు-, సింధు, చీనాబ్, జీలం నదుల నుండి నీటిని మూడు ఉత్తర భారత రాష్ట్రాలలోని నదుల్లోకి తరలించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు- రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. ప్రస్తుతం సింధు దాని ఉప నదులపై ఉన్న చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 3,360 మెగావాట్ల నుండి 12,000 మెగావాట్లకు పెంచాలని భావిస్తున్నట్టు- చెబుతున్నారు. కొత్తగా భారత్ ఈ నదులపై కనీసం ఐదు నీటి నిల్వ ప్రాజెక్టులను గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం ఉపనదులపై ఉన్నాయని తెలిపింది. కాగా, పాకిస్తాన్‌లోని దాదాపు 80 శాతంపొలాలకి, అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా సింధు నీటి ప్రవాహంపై ఆధారపడి ఉన్నాయి. పాకిస్తాన్ తో భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత మే ప్రారంభంలో పాకిస్తాన్‌లోని కీలకమైన ప్రాజెక్టుల్లో నీరు 90శాతం వరకు తగ్గిందిని చెబుతున్నారు. సింధునది టిబెట్‌లోని మానసరోవర్ దగ్గర ఉద్భవించి, అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది భారత్ లోని ఉత్తర, పాకిస్తాన్ లోని తూర్పు, ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రవహిస్తుంది.

# ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

## రైతులు దిగులు చెందాల్సిన పనిలేదు: మంత్రి పొన్నం ప్రభాకర్



**రాజన్న సిరిసిల్ల, మే 16:** తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎక్కడైనా ఏదైనా మస్య ఉంటే తెలియచేయాలని అన్నారు. జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు- పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

# అస్సాం సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం

## సింగర్ గాయత్రి హజారికా కన్నుమూత



**గౌహతి,మే 16 :** అస్సాం సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ అస్సామీ సింగర్ గాయత్రి హజారికా (44) కన్నుమూశారు. గత కొంత కాలంగా పెద్దప్రేగు క్యాన్సర్‌తో బాధపడుతోన్న ఆమె గువహతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. సరా పాటే పాటే ఫాగున్ నామే పాట ద్వారా సింగర్‌గా మంచి గుర్తింపు పొందిన గాయత్రి 44 ఏళ్ల వయస్సులోనే మరణించడంతో అస్సామీ సంగీత పరిశ్రమ తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. తుమి కున్ బిరోహి అనన్య, జంక్ నాసిల్ బోనోట్, కృజీ జోపోన్ వంటి అద్భుతమైన పాటలతో ద్వారా గాయత్రి ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. గాయత్రి మరణవార్త తెలుసుకుని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఆమె అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. సింగర్ గాయత్రి హజారికా మరణం పట్ల అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయత్రి అద్భుతమైన స్వరం, అస్సామీ సంగీతానికి ఆమె చేసిన శాశ్వత కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ గాయత్రి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అసోం గణ పరిషత్ అధ్యక్షుడు అతుల్ బోరా కూడా ఎక్స్ వేదికగా గాయత్రి హజారికా మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆమె ఆత్మీయ స్వరం అస్సామీ సంగీతాన్ని సుసంపన్నం చేసిందని.. లెక్కలేనన్ని హృదయాలను తాకిందని పేర్కొన్నారు. ఆమె చిన్న వయస్సులో మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సుప్రీం జడ్జి జస్టిస్ బేలా త్రివేది పదవీవిరమణ

## ఎలాంటి ఫేర్‌వెల్ లేకుండా సాదాసీదాగా ముగిసిన ప్రస్థానం




**న్యూఢిల్లీ, మే 16:** సుప్రీంకోర్టులో జడ్జిగా విధులు నిర్వర్తించిన జస్టిస్ బేలా ఎం త్రివేది శుక్రవారం పదవీవిరమణ చేశారు. సుప్రీంకోర్టులో ఆమె మూడున్నర ఏళ్ల పాటు జడ్జిగా విధులు నిర్వర్తించారు. సుప్రీంకోర్టులో జడ్జిగా చేసిన 11వ మహిళగా ఆమె కీర్తికెక్కారు. 1995 జూలైలో గుజరాత్‌లోని ట్రయల్ కోర్టు నుంచి ఆమె జర్నీ స్టార్ట్ అయ్యింది. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక కీలక తీర్పుల్లో బేలా త్రివేది పాత్ర ఉన్నది. బేలా త్రివేది జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన కోర్టులోనే.. ఆమె తండ్రి కూడా జడ్జిగా ఉన్నారు. ఈ విషయం అప్పట్లో చర్చనీయాంశమైంది. లిమ్కా బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డుల్లోకి కూడా ఆమె ఎక్కారు. 2021, ఆగస్టు 31వ తేదీన అత్యున్నత న్యాయస్థానం బేలా త్రివేదిని జడ్జిగా ప్రమోషన్ కల్పించారు. ఆ సమయంలో మొత్తం 9 మంది కొత్త జడ్జీలను ప్రకటించారు. ముగ్గురు మహిళల్లో ఈమె ఒకరు. వెనుకబడిన తరగతుల వారికి 10 శాతం కోటా ఇవ్వాలని తీర్పు ఇచ్చిన అయిదుగురు సభ్యుల ధర్మాసనంలో బేలా త్రివేది ఉన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు- చేసిన ఏడుగురు సభ్యుల ధర్మాసనంలోనూ ఆమె ఉన్నారు. ఎస్సీ జాబితాలో మార్పులు చేయంటే అది పార్లమెంట్ ద్వారే చేయాలని ఆమె ఓ 85 పేజీల నివేదిక తయారు చేసింది. పోక్సో చట్టానికి చెందిన ఓ కేసులో కీలక తీర్పు ఇచ్చారు. కామవాంఛతో మైనర్లను తాకితే అది లైంగిక దాడి అవుతుందని 2021లో తీర్పు ఇచ్చిన బెంచ్‌లో ఆమె ఉన్నారు. గుజరాత్‌లోని పటాన్‌లో 1960, జూన్ 10వ తేదీన ఆమె జన్మించారు. గుజరాత్ హైకోర్టులో ఆమె పదేళ్ల పాటు- లాయర్గా ప్రాక్టీస్ చేశారు. 1995, జూలై 1వ తేదీన అహ్మదాబాద్‌లోని సెషన్స్ కోర్టులో జడ్జిగా నియమించారు. హైకోర్టులో రిజిస్ట్రార్ విలిలెన్స్, గుజరాత్ సర్కారులో న్యాయ కార్యదర్శిగా చేశారు. రిటైర్మెంట్ సందర్భంగా సుప్రీకోర్టు న్యాయవాదుల సంఘాలు ఎటువంటి ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని ఏర్పాటు- చేయలేదు. దీని పట్ల విమర్శలు వస్తున్నాయి. సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాషి.. లాయర్ సంఘాలను తప్పుపట్టారు. సాధారణంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డు అసోసియేషన్ సంఘాలు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుంటాయి. అయితే జస్టిస్ బేలా త్రివేది రిటైర్మెంట్ గురించి మాత్రం ఆ సంఘాలు ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు.

# కోడిగుడ్డుపై ఈకలు పీకినట్లుంది

## కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ చామల




**హైదరాబాద్, మే 16:** కోడిగుడ్డుపై ఈకలు పీకినట్లు రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. సైకో రాము కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్నారని.. రామప్పగుడి దగ్గర అత్యుత్సాహంతో ఎవరో మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల కాళ్లు కడిగి ఉండవచ్చునని, దానికి తెలంగాణ మహిళల ఆత్మ గౌరవం ఏమైందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ట్విట్ చేశారని మండిపడ్డారు. పదేళ్లు వాళ్ల ఇంటి ఆడబిడ్డ గురించి తప్ప ఏ ఇంటి ఆడబిడ్డ గురించి మాట్లాడలేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఇప్పుడు కేటీఆర్ మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టర్లతో కాళ్లు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీదని.. జనాన్ని తప్పుదోవ పట్టించాలని కేటీ-ఆర్ రోజు ఏదో ఒకటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుంటే.. కేటీఆర్ డిస్టర్బ్ చేస్తున్నారని, గతంలో దండుకున్న వందల కోట్ల రూపాయలతో కొన్ని యూట్యూబ్ చానల్స్‌తో.. మార్ఫింగ్ వీడియోలతో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. మంత్రి కొండా సురేఖ ఏ సందర్భంలో మాట్లాడారో దానికి ఆమె సమాధానం చెబుతారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

# వందలాది మంది మావోలను హత్య చేస్తున్నారు

## ఆపరేషన్ కగార్ సరికాదన్న చాడ




**సిద్దిపేట, మే 16:** ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి, ఉగ్రవాదులను అంతం చేయడం ప్రపంచశాంతికి శుభ పరిణామం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నక్సలైట్లు శాంతి చర్చలకు సిద్ధమన్న చర్చించకుండా కక్ష ధోరణి వైఖరితో కేంద్ర ప్రభుత్వం, అమిత్ షా వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణం అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో సీపీఐ మండల మహాసభలు జరుగుతున్నాయి. ఈ వేడుకలకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వందల మంది మావోయిస్టులను చంపడం రాజ్యాంగ విరుద్ధం.. అమిత్ షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.. వామపక్ష పార్టీలన్నీ ఖగర్ ఆపరేషన్ ను తీవ్రంగా ఖండిస్తున్నాయి.. నక్సలైట్లతో ప్రధాని మోడీ, అమిత్ షా శాంతి చర్చలకు సిద్ధం కావాలి అని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే, కొత్త ఆసుపత్రి నిర్మాణం పేరుతో ఇప్పుడు కొనసాగుతున్న హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రి భవనాన్ని కూల్చివేయద్దు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంత వరప్రదాయాన్ని గౌరవెల్లి ప్రాజెక్టును గత బీఆర్ఎస్ కాలంలో కేసీఆర్ పూర్తి చేయలేదు అని ఆరోపించారు. ఇప్పుడు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా రెండేళ్లు గడుస్తున్నప్పటికీ 437 కోట్ల రూపాయలు తీసుకువచ్చాను అంటు-న్నాడు కానీ ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తి కావడం లేదని విమర్శలు గుప్పించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయాలనే డిమాండ్ తో సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# పాక్ దురాగతాలపై విదేశాల్లో ప్రచారం

## పహల్‌గామ్ ఉగ్రదాడిపై ప్రచారం

## ఎంపిల బృందాన్ని విదేశాలకు పంపే యోచన



**న్యూఢిల్లీ, మే 16:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ సహా ఇప్పటికే అనేక తక్షణ చర్యలు చేపట్టిన భారత్ ఇప్పుడు కొత్త ఇనీషియేటివ్ తీసుకోబోతోంది. ప్రపంచం ముందు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని బట్టబయలు చేయబోతోంది. ఎంపిలను బృందాలుగా చేసి విదేశాల్లో ప్రచారం నిర్వహించాలని చూస్తోంది. ఇందులో శశిథరూర్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ కూడా ఉండనున్నట్లు సమాచారం. పహల్గాంలో 26 మంది ప్రాణాలు బలిగొన్న ఉదంతాన్ని, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి.. ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీ ప్రతినిధుల బృందాన్ని విదేశాలకు పంపనుంది. కశ్మీర్‌పై పాకిస్తాన్ దురాగతాన్ని తిప్పికొట్టడానికి, పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదాన్ని బహిర్గతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యుల ప్రతినిధులను కీలకమైన ప్రపంచ రాజధానులకు పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఉగ్రవాద దాడులపై భారతదేశ దృక్పథాన్ని ప్రదర్శించడం, నిరంతర సీమాంతర ఉగ్రవాద బాధితురాలిగా భారతదేశం ఎదుర్కొంటు-న్న సవాళ్లని ప్రపంచానికి చాటి చెప్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఃఊఆ), ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపడతారు. దీంతో ఇప్పుడు.. సరిహద్దుల ఆవల నుంచి పుట్టు-కొచ్చే ఉగ్రవాదంపై భారత్ తన వాణిని ప్రపంచ దేశాల ముందు బలంగా వినిపించబోతోంది. ఈ దౌత్య ప్రచారానికి మద్దతు ఇవ్వడానికి విదేశాలలో ఉన్న భారత మిషన్లు పార్లమెంటరీ బృందాలతో కలిసి పనిచేస్తాయి. ఈ బృందంలో అధికార బీజేపీ ఎంపీలతో పాటు-, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు ఉండే అవకాశం ఉంది. దీనికి సంబంధించి కేంద్రం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది. భారత్ ఈ తరహా కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి.

# కేకేఆర్, ఆర్సీబీ మ్యాచ్‌కు సైతం వర్షం అడ్డంకి

## సంక్లిష్టం కానున్న కేకేఆర్ ప్లే ఆఫ్ అవకాశాలు




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లోని 58వ మ్యాచ్ శనివారం, మే 17న రాత్రి 7:30 గంటలకు జరగనుంది. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరగనుంది. ఆర్‌సీబీ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 2వ స్థానంలో ఉండగా.. మరో విజయంతో ప్లేఆఫ్ స్థానాన్ని దక్కించుకోవాలని ఆర్సీబీ భావిస్తోంది. అదే సమయంలో ఆరవ స్థానంలో ఉన్న కేకేఆర్ ఇంకా ప్లే ఆఫ్ రేసులో నిలవాలంటే తరువత మ్యాచ్ లో తప్పనిసరిగా విజయం సాధించాలి. కానీ ప్రతికూల వాతావరణం కేకేఆర్ అవకాశాలను దెబ్బతీసే అవకాశం ఉంది. గురువారం బెంగళూరు నగరంలో భారీ వర్షం కురిసింది. తాజా వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, శనివారం సైతం వర్షం కురిసే అవకాశం ఉంది. ఇదివరకే వర్షం కారణంగా కేకేఆర్ ఆడాల్సిన ఓ మ్యాచ్ రద్దు అయింది. వర్షం కారణంగా శనివారం జరగాల్సిన కేకేఆర్ %జం% ఆర్‌సీబీ మ్యాచ్ కనుక రద్దు అయితే, రెండు జట్లకు ఒక్కో పాయింట్ లభిస్తుంది. ఆర్‌సీబీ ఆ ఒక్క పాయింట్‌తో ప్లేఆఫ్ అర్హత సాధించనుంది. మరోవైపు వర్షం కేకేఆర్ ప్లే ఆఫ్ అవకాశాలను తుడిచిపెట్టినట్లే. కోల్‌కతా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 14 లీగ్ దశ మ్యాచ్‌లలో 12 మ్యాచ్‌లు ఆడి, 5 గెలిచింది, 6 ఓడింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. వారికి ఖాతాలో ప్రస్తుతం 13 పాయింట్లు ఉన్నాయి. 2 లీగ్ దశ మ్యాచ్‌లు (మే 17న ఆ, మే 25న ఎస్‌ఆర్‌హెచ్‌తో) మిగిలి ఉన్నాయి.

కేకేఆర్, ఆర్‌సీబీ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయితే మ్యాచ్ నుంచి లభించే ఒక్క పాయింట్ వారిని 14కి తీసుకువెళుతుంది. అది టాప్ ఫోర్ ఫినిష్‌కు సరిపోదు. కనుక కేకేఆర్ ప్లేఆఫ్ ఆశలు సజీవంగా నిలవాలంటే కనీసం 16 పాయింట్లకు దాటాలి. అప్పుడు కనీసం చివరి వరకు ఇతర మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడి కేకేఆర్ ప్లే ఆఫ్ ఆశలు ఉంటాయి. 16 పాయింట్లు పొందడానికి లీగ్ చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. ఆర్‌సీబీ, ఎస్‌ఆర్‌హెచ్‌లపై విజయం సాధిస్తేనే కోల్‌కతాకు ప్లే ఆఫ్ ఆశలు ఇంకా మిగిలి ఉంటాయి.

ంగా, ఐపీఎల్ లీగ్ దశలో కనీసం 16 పాయింట్లు సాధించిన జట్లకు ప్లేఆఫ్స్‌లో స్థానం దక్కుతోంది. అయితే 16 పాయింట్లు దక్కినా సరైన రన్ రేట్ లేకపోతే ఆ జట్టు ఇంటి దారి పట్టనుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ శనివారం రాత్రి రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఓడించగలిగితే, వారు కీలకమైన 2 పాయింట్లను సాధిస్తారు. పాయింట్స్ టేబుల్‌లో 15 పాయింట్లకు చేరతారు. అయితే, ప్లేఆఫ్స్‌కు చేరుకోవడానికి కేకేఆర్ కచ్చితంగా మిగిలిన 2 మ్యాచ్ లలో ఆర్సీబీ, సన్‌రైజర్స్ లపై విజయం సాధించక తప్పదు. అప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్ కేకేఆర్ లీగ్ దశను 17 పాయింట్లతో ముగించి ప్లే ఆఫ్ ఆశలను సీజవంగా నిలుపుకుంటుంది.భారత్ మరియు పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 2025 ఒక వారం పాటు నిలిపివేయబడింది. ఈ టోర్నమెంట్ ఇప్పుడు మే 17 నుండి ఆర్‌సీబీ %జం% కేకేఆర్ మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది.



## ఐపీఎల్‌కు మిచెల్ స్టార్క్ దూరం..

ఇండియా, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో.. విదేశీ క్రికెటర్లు ఐపీఎల్‌ను వీడి వెళ్లిన విషయం తెలిసిందే. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను అర్ధాంతరంగా ఆపివేయడంతో.. కొందరు విదేశీ ఆటగాళ్లు తమ దేశానికి వెళ్లిపోయారు. అయితే శనివారం నుంచి మళ్లీ మ్యాచ్‌లు పునర్ ప్రారంభంకానున్న నేపథ్యంలో. . కొందరు ఆటగాళ్లు తిరిగి వచ్చేందుకు వెనుకాడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్న స్పీడ్ బౌలర్ మిచెల్ స్టార్క్.. మళ్లీ ఐపీఎల్‌లో ఆడేందుకు రావడం లేదని స్పష్టం చేశారు. జట్టుతో మళ్లీ కలవడం లేదని ఫ్రాంచైజీలకు స్టార్క్ చెప్పినట్లు సమాచారం ఉన్నది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో మిచెల్ స్టార్క్ ప్రధాన బౌలర్‌గా ఉన్నాడు. ఈ సీజన్‌లో ఆ జట్టు తరపున అతను 11 మ్యాచుల్లో 14 వికెట్లను తీశాడు. అయితే ఢిల్లీ జట్టు ప్లేఆఫ్స్‌కు వెళ్లాలన్న సంకల్పంతో ఉన్న నేపథ్యంలో స్టార్క్ లేకుండా మిగితా టోర్నీ ఆడడం ఆ జట్టుకు కష్టమే కానున్నది. డీసీ జట్టుకు మళ్లీ ఫా డూప్లిసెస్ జత కలుస్తాడో లేదో ఇంకా స్పష్టంగా తెలియదు. కేవలం లీగ్ దశలో ఆడేందుకు మాత్రమే మళ్లీ జట్టుతో కలవనున్నట్లు ట్రిస్టన్ స్టబ్స్ తెలిపాడు. ఆ తర్వాత వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు వెళ్లనున్నట్లు అతను పేర్కొన్నాడు.జేక్ ఫ్రేజర్ మెగుర్క్ స్థానంలో ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను డీసీ తీసుకున్ని. జేక్ ఫ్రేజర్ మళ్లీ ఇండియాకు రావడం లేదు. ముస్తఫిజుర్ రెహ్మాన్ కు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నుంచి క్లియరెన్స్ సర్టిఫికేట్ రావాల్సి ఉంది.ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ .. ఆర్సీబీ జట్టుతో జత కలిసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా వెళ్లిన అతను మళ్లీ ఐపీఎల్‌లో ఆడేందుకు ఇండియా వస్తున్నాడు. ఈ విషయాన్ని అతను కన్ఫర్మ్ చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత కోల్పోయినా.. ఆ జట్టు ఆటగాళ్లు పాట్ కమ్మిన్స్, ట్రావిస్ హెడ్ మళ్లీ ఐపీఎల్‌లో ఆడేందుకు వస్తున్నారు. మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఆ క్రికెటర్లు నేరుగా లండన్‌లో జరిగే వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు వెళ్తారు.

## ఇంగ్లండ్ పర్యటనకు శ్రేయస్ అయ్యర్ దూరం..




ఐపీఎల్ 2025 సీజన్ ముగిసిన వెంటనే టీమిండియా 5 టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ సిరీస్‌తో డబ్ల్యూటీసీ 2027 సైకిల్ ప్రారంభం కానుంది. టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టు ఎంపిక సెలెక్టర్లకు సవాల్‌గా మారింది.కోహ్లీ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడు ఎవరా? అనేది చర్చనీయాంశమైంది. అయితే కోహ్లీ స్థానాన్ని శ్రేయస్ అయ్యర్ మాత్రమే భర్తీ చేయగలడని మాజీ క్రికెటర్లతో పాటు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేసే జట్టులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కుతుందని భావిస్తున్నారు. అయితే గతేడాది సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ మధ్యలోనే శ్రేయస్ అయ్యర్‌పై వేటు పడింది. ఫిట్‌నెస్ సమస్యలతో పాటు బ్యాటింగ్ టెక్నిక్‌లో లోపం ఉండటంతో సెలెక్టర్లు జట్టు నుంచి తప్పించారు.మరోసారి ఆ బలహీనతల కారణంగానే ఇంగ్లండ్ పర్యటనకు శ్రేయస్ అయ్యర్ దూరమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా షార్ట్ బాల్స్ ఆడటంలో శ్రేయస్ అయ్యర్ తడబడ్డాడు. దాంతో ప్రతీ జట్టు శ్రేయస్ అయ్యర్ రాగానే షార్ట్ పిచ్ బాల్స్ వేస్తూ అందుకు అనుగుణంగా ఫీల్డ్ సెటప్ చేసి ఫలితం రాబట్టారు. ఈ బలహీనతపై వర్క్ చేసిన శ్రేయస్ అయ్యర్.. దాన్ని బలంగా మార్చుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో షార్ట్ పిచ్ బాల్స్‌ను బౌండరీకి తరలించి పరుగులు రాబట్టాడు. ఐపీఎల్‌లోనూ చెలరేగుతున్నాడు.షార్ట్ పిచ్ బాల్స్ వేసిన బౌలర్లను తనదైన శైలిలో శిక్షిస్తున్నాడు. అయితే వైట్ బాల్ క్రికెట్‌లో రాణించినట్లు.. టెస్ట్ ఫార్మాట్‌లో షార్ట్ పిచ్ బాల్స్‌ను బౌండరీలకు తరలించడం అంత సులువు కాదని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. విదేశీ పిచ్‌లు సహజంగానే బౌన్సీగా ఉంటాయి. ఈ క్రమంలోనే విదేశీ టెస్ట్ సిరీస్‌ల్లో శ్రేయస్ అయ్యర్‌ను ఆడించి రిస్క్ చేసే యోచనలో భారత సెలెక్టర్లు లేరు. సొంతగడ్డపై టెస్ట్ మ్యాచ్‌లు ఆడించిన తర్వాతే.. అతన్న విదేశీ పర్యటలకు ఎంపిక చేసే అవకాశం ఉంది. అయితే గతేడాదిగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించిన శ్రేయస్ అయ్యర్.. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ ఆ ఫామ్ కొనసాగిస్తున్నాడు.

## ఆర్‌సీబీ మహిళల జట్టు ఒక టైటిల్ గెలిచింది

### త్వరలోనే పురుషుల జట్టు కూడా టైటిల్ అందుకుంటుంది

### ఆర్‌సీబీ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి ఒక్క ఐపీఎల్ ట్రోఫీ లేదని, ఈ సారి గెలుస్తారా? అన్న ప్రశ్నకు ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ ఆగ్రహానికి గురయ్యాడు. ఆర్‌సీబీకి ట్రోఫీ లేదని ఎవరూ అనలేరని, తమ మహిళల జట్టు ఒక టైటిల్ గెలిచిందని చెప్పాడు. త్వరలోనే పురుషుల జట్టు కూడా టైటిల్ అందుకుంటుందని ధీమా వ్యక్తం చేశాడు. ప్రముఖ క్రికెట్ హోస్ట్ మయంతి లాంగర్‌తో జరిగిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రజత్ పటీదార్ ఈ వ్యాఖ్యలు చేశాడు.'మాకు ఒక ట్రోఫీ ఉంది. మా మహిళల జట్టు టైటిల్ గెలిచింది. వాళ్ల విజయం ఆదర్శం. మాకు ట్రోఫీ లేదని ఎవరూ అనలేరు. నేను కెప్టెన్ అయిన తర్వాతే ఆర్‌సీబీ ఎంత పెద్ద ఫ్రాంచైజీ అనే విషయం తెలిసింది. నాకు కూడా ఆర్‌సీబీ అంటే చాలా ఇష్టం ఉండేది. విరాట్ భాయ్, ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ కారణంగానే నేను ఐపీఎల్ చూడటం స్టార్ట్ చేశాను. వారిని టీవీలో చూస్తూ నేను కూడా జీవితంలో ఒక్కసారైనా ఆర్‌సీబీకి ఆడాలనుకునేవాడిని.'అని తెలిపాడు.ఆర్‌సీబీ జట్టులోకి తాను రిప్లేస్‌మెంట్ ఆటగాడిగా రావాలనుకోలేదని, బ్యాకప్ ప్లేయర్‌గా బెంచ్‌పై కూర్చోవడం తనకు నచ్చదని తెలిపాడు. వేలంలో ఆర్‌సీబీ కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు చెప్పుకొచ్చాడు. 'ఐపీఎల్ 2022 మెగా వేలానికి ముందు నిన్ను తీసుకుంటాం. రెడీగా ఉండని ఆర్‌సీబీ ఫ్రాంచైజీ నుంచి మెసేజ్ వచ్చింది. కానీ మెగా ఆక్షన్‌లో నన్ను ఆర్‌సీబీ కొనుగోలు చేయలేదు. దాంతో తీవ్ర కోపం వచ్చింది. బాధగా అనిపించింది. ఆ తర్వాత లవ్నిత్ సిసోడియా గాయపడటంతో నన్ను రీప్లేస్‌మెంట్‌గా తీసుకున్నారు.నిజం చెప్పాలంటే రీప్లేస్‌మెంట్‌గా రావడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే అక్కడ నాకు ఆడే అవకాశం రాదని తెలుసు. డగౌట్‌లో కూర్చోవడం నాకు ఎప్పుడూ ఇష్టం ఉండదు' అని రజత్ పటీదార్ చెప్పుకొచ్చాడు. ఆ సీజన్‌లో రీప్లేస్‌మెంట్ ఆటగాడిగా జట్టులోకి వచ్చిన రజత్ పటీదార్ అసాధారణ ప్రదర్శనతో దుమ్మురేపాడు. ఆ తర్వాత జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకొని ఈ సీజన్‌లో సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. 11 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది. ప్లే ఆఫ్స్‌కు విజయం దూరంలో నిలిచింది.

## విరాట్ ఇంకో రెండేళ్లు ఆడతాడనుకున్నా

### వన్డేల్లో ఆడాలని అనుకుంటున్నాడు

### అలాగే ఇంకా ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆడతాడు

### విరాట్ రిటైర్మెంట్‌పై రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు



టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు ఫార్మాట్ నుంచి తప్పుకోవడం తనను షాక్‌కు గురిచేసిందని మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. మరో 2- 3ఏళ్లు టెస్టు క్రికెట్‌లో కొనసాగే ఫిట్‌నెస్ అతడికి ఉందని శాస్త్రి అభిప్రాయపడ్డాడు. అయితే అతడు రిటైర్మెంట్ ప్రకటించే వారం ముందే విరాట్‌తో మాట్లాడినట్లు రవిశాస్త్రి చెప్పాడు. వాళ్లిద్దరి మధ్య జరిగిన చర్చ గురించి రవిశాస్త్రి తాజాగా షేర్ చేసుకున్నారు. 'విరాట్‌తో రిటైర్మెంట్ ప్రకటించే వారం ముందే అతడితో మాట్లాడాను. రెండు, మూడు ప్రశ్నలు అడిగాను. విరాట్ తన నిర్ణయం పట్ల చాలా క్లారిటీగా ఉన్నాడు. జట్టు కోసం తాను చేయాల్సింది అంతా చేశానని చెప్పాడు. తనలో ఎలాంటి విచారం, కన్‌ఫ్యూజన్ లేదు. క్లారిటీగా ఉన్నాడు. తన సమాధానం విన్నాక రిటైర్మెంట్ ఇచ్చేందుకు 'ఇదే కరెక్ట్ టైమ్' అని నాకు కూడా అనిపించింది. ఇక వన్డేల్లో ఆడాలని అనుకుంటున్నాడు. అలాగే ఇంకా ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆడతాడు' అని విరాట్‌తో జరిగిన సంభాషణ గురించి శాస్త్రి పేర్కొన్నాడు. 'విరాట్ ఇంకో రెండేళ్లు ఆడతాడనుకున్నా. కానీ, సడెన్‌గా రిటైర్మెంట్ అనౌన్స్ చేసి షాకిచ్చాడు. అయితే అతడు మానసికంగా అలసిపోయాడు. జట్టులో అందరికంటే శారీరకంగా ఫిట్‌గా ఉన్నా, మానసికంగా అలసిపోయాడు. సాధారణంగా ఓ ప్లేయర్ మ్యాచ్‌లో తన పని పూర్తి చేసి ప్రశాంతంగా ఉంటాడు. కానీ, విరాట్ అలా కాదు. బరిలోకి దిగితే అన్ని క్యాచ్‌లు పట్టాలి, పూర్తి స్థాయిలో బ్యాటింగ్ చేయాలి, అన్ని వికెట్లు తనే తీసుకోవాలి అన్నట్లు చురుగ్గా ఉంటాడు. ఆట తీవ్రత ఆ స్థాయిలో ఉంటే రెస్ట్ అనేకి కచ్చితంగా అవసరం. లేకపోతే మానసికంగా అలసిపోక తప్పదు' అని రవిశాస్త్రి అన్నాడు. కాగా, విరాట్ తన 14 ఏళ్ల టెస్టు కెరీర్‌కు ఇటీవల వీడ్కోలు పలికాడు. 2011లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన విరాట్ గతేడాది ఆసీస్?పై చివరి మ్యాచ్ ఆడాడు. 123 టెస్టుల్లో 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక ఇప్పటికే టీ20 లకూ రిటైర్మెంట్ ఇచ్చేసిన కోహ్లీఇకపై కేవలం వన్డేల్లోనే కొనసాగనున్నాడు.




## షెఫాలీ వర్మ, ఆల్ రౌండర్ స్నేహ్ రాణాకు పొట్టి ఫార్మాట్ లో చోటు

### ఇంగ్లాండ్ తో వన్డే, టీ20 సిరీస్ కు భారత జట్ల ప్రకటన

వచ్చే నెలలో ఇంగ్లాండ్ లో పర్యటించబోయే భారత మహిళా జట్టును బీసీసీఐ సెలెక్షన్ కమిటీ తాజాగా ప్రకటించింది. జూన్ 28 నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటనలో ఐదు టీ20ల సిరీస్, జూలై 16 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభమవుతుంది. ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ లో గెలిచి ఊపుమీదున్న భారత్.. ఈ పర్యటనలోనూ సత్తా చాటాలని తహతహలాడాలని భావిస్తోంది. సౌతాఫ్రికా, లంక పాల్గొన్న ఈ సిరీస్ లో ఫైనల్లో ఆసియా చాంపియన్ లంకను చిత్తు చేసి విజేతగా నిలిచింది. చాలా రోజుల తర్వాత విధ్వంసక ఓపెనర్ షెఫాలీ వర్మ, ఆల్ రౌండర్ స్నేహ్ రాణాకు పొట్టి ఫార్మాట్ లో చోటు దక్కింది. ఇక పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్లు క్రాంతి గౌడ్, సయోలీ సత్ఘరే, స్పిన్నర్లు శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయలకు తొలిసారిగా టీ20 జట్టులో చోటు దక్కింది. నాలుగు వారాలపాటు జరిగే ఈ టూర్ ను జూన్ 28న నాటింగ్ హామ్ లో జరిగే తొలి టీ20తో భారత్ ఆరంభిస్తుంది. ఆ తర్వాత వరుసగా జూలై 1 న బ్రిస్టల్ లో రెండో టీ20, నాలుగున ఓవల్ లో మూడో టీ20, 9న మాంచెస్టర్ లో నాలుగో టీ20, 12న బర్మింగ్ హాంలో ఐదో టీ20ని ఆడుతుంది. ఆ తర్వాత 16 జూలై నుంచి మొదలయ్యే వన్డే సిరీస్ లో తొలి మ్యాచ్ ను సౌతాంప్టన్ వేదికగా ఆడుతుంది. ఆ తర్వాత అదేనెల 19న క్రికెట్ మక్కా లార్డ్స్ లో రెండో వన్డే, 22న ఆఖరిదైన మూడో వన్డేను చెస్టర్ లీ స్ట్రీట్ లో ఆడుతుంది. ఈ రెండు ఫార్మాట్లకు కెప్టెన్ గా హర్మన్ ప్రీత్ కౌర్ వ్యవహరిస్తుండగా, ఆమెకు డిప్యూటీగా స్మృతి మంధాన బాధ్యతలు మోయనుంది. ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ కు భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, నల్లపురెడ్డి శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయ్, అమంజోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే.ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ కు భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయ్, అమన్‌జ్యోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్. సయాలీ సత్ఘరే.


# ఎన్టీఆర్ నెగెటివ్ షేడ్‌లో వార్-2

## 20న టీఈజర్ విడుదలకు సన్నాహాలు




:బాలీవుడ్‌లో ఇదివరకు సంచలన విజయం అందుకున్న యాక్షన్ స్పై థ్రిల్లర్ 'వార్'కు సీక్వెల్‌గా రాబోతున్న చిత్రం 'వార్ 2'. 2019లో విడుదలైన మొదటి భాగంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ యాక్షన్ సీన్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశారు. ఇప్పుడు ఈ సీక్వెల్‌కి మరింత క్రేజీగా రూపొందించడానికి పాన్ ఇండియా స్టార్ ఎన్టీఆర్ రంగంలోకి దిగాడు. ఇది ఎన్టీఆర్‌కి బాలీవుడ్‌లో తొలి చిత్రం కావడంతోనే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 'బ్రహ్మాస్త్ర' వంటి విజువల్ వండర్‌ని తెరపైకి తీసుకొచ్చిన అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్నారు. యశ్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రానికి సరికొత్త మేకింగ్ కథాంశం ఉండబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర ఎలా ఉండబోతుందనేది అభిమానుల్లో పెద్ద క్యూరియాసిటీగా మారింది. కొన్ని లీకుల ప్రకారం, ఆయన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని, అయితే అది పూర్తిగా విలన్ కాదని.. గ్రే షేడ్స్ కలిగిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని సమాచారం. కొత్త లుక్‌లో ఎన్టీఆర్ స్క్రీన్‌పై ఎలా కనిపిస్తాడన్నదే ఇప్పుడు ప్రధాన చర్చాంశం. ఇక ఈ సినిమాకు సంబంధించి టీజర్ విషయానికి వస్తే.. ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 సందర్భంగా చిత్ర యూనిట్ రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో ఉంది.

# హరిహరవీరమల్లు..జూన్ 12న విడుదల



పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ చిత్రం హరి హర వీరమల్లు. ఈ సినిమా విడుదల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు ఎట్టకేలకు శుభవార్త అందింది. అన్ని అడ్డంకులను దాటుకొని జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన మొత్తం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ చిత్రం పాన్‌ఇండియా స్థాయిలో విడుదల అవుతుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పెద్దెత్తున విడుదల కానుంది. అమెజాన్ ప్రైమ్ దీని డిజిటల్ రైట్స్‌ను భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ హరి హర వీరమల్లు సినిమా గత కొన్నేళ్లుగా ఆలస్యమవుతూ వచ్చింది. హీరో పవన్ కళ్యాణ్ రాజకీయాల కారణంగా ఈ సినిమా షూటింగ్ నిరవధికంగా ఆగిపోవడంతో ఆలశ్యం అయ్యింది. కానీ ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ లో పాల్గొని పూర్తి చేశారు. మే 6, 2025న సినిమా చిత్రీకరణ ముగిసినట్లు- నిర్మాతలు ప్రకటించారు. గతంలో ఈ సినిమా మార్చి 28, మే 9 తేదీలలో విడుదల అవుతుందని పలు వార్తలు వచ్చినా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది.



# కీర్తి సురేష్ కోసం వాళ్ల ఎదురుచూపులు..!

మహానటి కీర్తి సురేష్ మొన్నటిదాకా సౌత్ లోనే సినిమాలు చేయగా జస్ట్ పెళ్లికి ముందే బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. అక్కడ బేబీ జాన్ అనే సినిమాతో అమ్మడు చేసిన ప్రయత్నం తెలిసిందే. అదేంటో తెలుగు, తమిళ్ లో పదుల సంఖ్యలో సినిమాలు చేసిన కీర్తి సురేష్ తనలోని హాలిలిట్ యాంగిల్ ని చూపించింది లేదు. కానీ అమ్మడు మాత్రం హిందీలో చేసిన తొలి సినిమాకే ఒక రేంజ్ లో రెచ్చిపోయింది. దీనికి ప్రత్యేకంగా కారణం అంటూ ఏది లేదు. సౌత్ భామలో ఎవరైనా బాలీవుడ్ వెళ్లగానే ముందు గ్లామర్ తోనే అక్కడ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయాలని ప్రయత్నిస్తారు. కీర్తి సురేష్ కూడా అదే దారిలో వెళ్లాలని చూస్తుంది. బేబీ జాన్ రిజల్ట్ ఆమెను సాటిస్ఫై చేయలేదు. ఐతే కీర్తి సురేష్ సౌత్ ఫ్యాన్స్ మాత్రం అమ్మడిలోని ఈ డిఫరెంట్ యాంగిల్ ని ఎంజాయ్ చేస్తున్నారు. ఇదిలాఉంటే లాస్ట్ ఇయర్ డిసెంబర్ లో కీర్తి సురేష్ తన బాయ్ ఫ్రెండ్ ఆంటోనిని పెళ్లాడింది. 15 ఏళ్లుగా సీక్రెట్ లవ్ స్టోరీని నడిపించిన కీర్తి సురేష్ ఫైనల్ గా పెళ్లితోనే తన సోల్ మేట్ ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. పెళ్లి కాగానే బేబీ జాన్ ప్రమోషన్స్ లో పాల్గొన్న అమ్మడు ఆ తర్వాత ఇక హాలీడేస్ తీసుకుంది. భర్తతో ఎంచక్కా ప్రపంచ యాత్రలో ఉన్న కీర్తి సురేష్ నెక్స్ట కమిట్ మెంట్స్ ఉన్నా కూడా తీరిక చేసుకునే టైం కనిపించట్లేదు. పెళ్లైన ఏ హీరోయిన్ అయినా కూడా ఏడాది పాటు అలా విహరిస్తూ లైఫ్ ని ఎంజాయ్ చేస్తుంటారు. కీర్తి కూడా ప్రస్తుతం అలాంటి మూడ్ లోనే ఉంది. ఐతే ఆమె కమిటైన సినిమా మేకర్స్ ఆమె ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో ఎల్లమ్మ సినిమాకు సైన్ చేసిందని తెలుస్తుంది. ఈ సినిమాకు ఆమె బ్లక్ డేట్స్ కావాలని అడిగారట. ఐతే కీర్తి మాత్రం ఎప్పుడు షూటింగ్ కి వస్తానన్నది క్లారిటీ ఇవ్వట్లేదట. ఆమె కోసం చిత్ర యూనిట్ అంతా ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారని తెలుస్తుంది. ఐతే కీర్తి కూడా హాలీడేస్ టైం లో సినిమాల గురించి ఆలోచన వదిలేసి భర్తతో ప్రతి మూమెంట్ ని ఎంజాయ్ చేస్తుంది. అందుకే విహార యాత్రలు ముగించుకుని వచ్చిన తర్వాతే సినిమ యూనిట్ తో టచ్ లో ఉండాలని అనుకుందట. ఐతే త్వరలోనే ఎల్లమ్మ ఫస్ట్ షెడ్యూల్ మొదలు పెడుతున్నారని తెలుస్తుంది. నితిన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాను బలగం వేణు డైరెక్ట్ చేస్తున్నాడు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు భారీ బడ్జెట్ కేటాయిస్తున్నట్టు తెలుస్తుంది.

# తీరిక లేని షెడ్యూళ్లతో నలిగిపోతున్న మిల్కీ



2005లో శ్రీ అనే చిత్రంతో కథానాయికగా ఆరంగేట్రం చేసింది తమన్నా భాటియా. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్ రన్ పూర్తి చేసింది. ఇలాంటి ఎగ్జయిటింగ్ కెరీర్ చాలా మంది సమకాలీన కథానాయికలకు లేదు. కెరీర్ పోరాటం సాగించలేక మిడిల్ డ్రాప్ అయిన కథానాయికలు ఉన్నారు. కానీ ముంబై టు హైదరాబాద్ తమన్నా జర్నీ ఇంట్రెస్టింగ్. చాంద్ షా రోషన్ తమన్నాకు హిందీలో డెబ్యూ మూవీ. ఆ తర్వాత శ్రీ సినిమాతో తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టి, హ్యాపీడేస్ తో సంతృప్తికరమైన విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా అగ్ర కథానాయకుల సరసన అవకాశాలు అందుకుంది. తెలుగు, తమిళంలో టాప్ హీరోయిన్ గా స్టార్ డమ్ అందుకున్న తమన్నా బాహుబలి లాంటి పాన్ ఇండియా సినిమాలోను నటించింది.

అయితే తమన్నా కెరీర్ లో విజయాల కంటే ఫ్లాపులే ఎక్కువ. అందువల్ల ప్రతిసారీ తమన్నా పని అయిపోయింది! అంటూ మీడియాలో ప్రచారం సాగేది. కానీ అన్నిటినీ అధిగమించి కెరీర్ బెస్ట్ ఫేజ్ కి ఎదిగింది తమన్నా. టాలీవుడ్ కోలీవుడ్ లో అగ్ర హీరోలందరి సరసనా కథానాయికగా నటించింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా తమన్నా కెరీర్ బెస్ట్ ఫేజ్ ని ఆస్వాధిస్తోంది. ప్రస్తుత సంవత్సరంలో వరుసగా అరడజను ప్రాజెక్టులతో బిజీ బిజీగా ఉంది. ఇటీవల ఆజ్ కీ రాత్.. నషా వంటి ఐటమ్ నంబర్లతోను తమన్నా మెరుపులు మెరిపించింది. హిమ్మత్ వాలా, రైడ్ 2 తర్వాత అజయ్ దేవగన్ తో కలిసి %-%రేంజర్%-% లో నటిస్తోంది. అడవి నేపథ్యంలో ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. అలాగే వేదా తర్వాత మరోసారి జాన్ అబ్రహం తో జతకట్టనుంది. సిద్ధార్థ్ మల్హోత్రా, వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జిత్ దోసాంజ్ లతో కలిసి రెండు వేర్వేరు ప్రాజెక్టులలోను నటిస్తోంది. వీటితో పాటు ఒక భారీ క్రేజీ వెబ్ సిరీస్ లోను తమన్నా భాగమైంది. కెరీర్ పరంగా ఇది బెస్ట్ ఫేజ్ అని తమన్నా భావిస్తోంది. టాలీవుడ్ లో ఓదెల 2 ఇటీవలే విడులైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పలువురు దర్శకులు తమన్నాకు స్క్రిప్టులు వినిపిస్తున్నారని సమాచారం. ఈ ఏడాది డిసెంబర్ తో తమన్నా 20 ఏళ్ల కెరీర్ ని దిగ్విజయంగా పూర్తి చేసుకోనుంది.

# రామాయణంలో మండోదరిగా కాజల్ ?

టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సత్యభామ అంటూ ఇటీ-వల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. అయితే ఈ భామ తాజాగా మరో బంఫరాఫర్ కొట్టినట్లు- తెలుస్తుంది. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణలో కాజల్ ఛాన్స్ కొట్టేసినట్లు- తెలుస్తుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కాజల్ రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు. నితీష్ తివారి 'రామాయణ' ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి నటీనటుల ఎంపికపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఖరారయ్యారు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేసినట్లు- వార్తలు వస్తున్నాయి. కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. ఆమె నటనకు మంచి గుర్తింపు ఉంది. 'మగధీర', 'డార్లింగ్', 'బృందావనం' వంటి తెలుగు చిత్రాలతో పాటు-, 'సింగం', 'స్పెషల్ 26' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటు-కున్నారు. ఇప్పుడు 'రామాయణం'

వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో మండోదరి వంటి బలమైన పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలి. మండోదరి పాత్ర రామాయణంలో ఒక ముఖ్యమైన పాత్ర. రావణుడి పట్టపురాణిగా ఆమె రావణుడికి మంచి సలహాలు ఇస్తూ, ధర్మం వైపు నిలబడే ప్రయత్నం చేస్తుంది. తన భర్త తప్పులను ఎత్తిచూపుతూ, సీతను తిరిగి రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కాబట్టి, ఈ పాత్రకు కాజల్ వంటి అనుభవం ఉన్న నటి అయితే మరింత న్యాయం చేకూరుస్తుందని మేకర్స్ భావిస్తున్నట్లు- సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, కాజల్ అగర్వాల్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు. నితీష్ తివారి 'రామాయణం' మూడు భాగాలుగా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంటు-ందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతికతతో ఈ చిత్రం రూపొందనుంది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463